ప్రజాశక్తి
ఆదివారం 7 జూలై 2024 5 అనంతపురం





వైద్య పరీక్షల నిమిత్తం నిందితులను ఆసుపత్రికి తరలిస్తున్న అధికారులు

రేపటి నుంచి ఇసుక ఉచితం



పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఇసుక విధానం రేపటి నుంచి అమల్లోకి రానుంది. ఈ మేరకు ఉచితంగా ఇసుకను అందించే ఏర్పాట్లను అధికార యంత్రాంగం పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కొత్త ఇసుక విధానం. రవాణ ఛార్జీలు తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎక్కడ ఇసుక ఎంత నిలువ ఉందన్న వివరాలను సేకరించారు. డిపోల్లో నిలువ ఉన్న ఇసుకకు భద్రత ఏర్పాటు చేయాలన్న సూచనలు చేశారు.

మెట్రిక్ టన్ను ఇసుక ధర రూ.195

ఒక మెట్రిక్ టన్ను ఇసుక ధర రూ.195లుగా జిల్లా కలెక్టరు ఆధ్వర్యంలోని జిల్లా ఇసుక కమిటీ నిర్ణయించింది. ఇసుక రీచ్‌ను డిపోకు తేవడం, లోడింగు ఛార్జీలు మరియు రాయల్టీ కలిపి రూ.195 నిర్ణయించింది. దీనికి మాత్రమే లబ్ధిదారులు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఇసుక మాత్రం ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించారు.ఇకపోతే రవాణా ఛార్జీలు ఎంతన్నది ఇంకా నిర్ణయించాల్సి ఉంది. ఆరు చక్రాల వాహనానికి ఒక ధర, పది చక్రాల వాహనానికి ఒక ధర ప్రకారం అమలు చేస్తే బాగుంటుందని నిర్ణయించారు. ఇకపోతే రోజుకు 20 మెట్రిక్ టన్నుల వరకు ఒక్కో లబ్ధిదారుడికి అందజేస్తారు. ప్రతి లబ్ధిదారులు ఆధార్‌కార్డుతోపాటు మొబైల్ నంబరు, డెలివరి అడ్రసును అందించాల్సి ఉంటుంది. ప్రతి రోజూ ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మాత్రమే పంపిణీ చేయడం జరుగుతంది. ఆ తరువాత క్యూఆర్ కోడ్ పనిచేయదు. రవాణా ఛార్జీల కోసం చెల్లించిన మొత్తం కూడా క్యూఆర్ కోడ్ ద్వారా డిడి మైన్సు అధికారిక ఖాతాలోకి వెళ్లే విధంగా నిర్ణయం చేశారు.

ఎక్కడ ఎంత ఇసుక ఉంది

జిల్లాలో రాయదుర్గం మండలం జుంజురాంపల్లిలోనున్న ఇసుక డిపోలో 58160 మెట్రిక్ టన్నులు. రచ్చుమర్రి వద్ద 13278 మెట్రిక్ టన్నులు ఇసుక ప్రస్తుతం అందుబాటులో ఉంది. ఈ ఇసుకను రేపటి నుంచి జరిగే పంపిణీని ప్రారంభించే విధంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులకు కలెక్టరు ఆదేశించారు. ఎక్కడ ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా ఇసుక పంపిణీ చేపట్టే విధంగా తహశీల్దార్లు, అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ గౌతమి శాలి, కళ్యాణదుర్గం ఆర్డీవో సుస్మిత, మైన్సు డిడి నాగయ్య, సెబ్ అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, ఆర్‌డబ్లుఎస్ ఎస్ఇ ఎహసాన్ బాష తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు రైల్వే కార్యాలయంలో ముగిసిన సిబిఐ సోదాలు

డిఆర్ఎంతో కలసి నలుగురు అధికారుల అరెస్టు

కర్నూలు జిల్లా సిబిఐ కోర్టుకు తరలింపు

ప్రజాశక్తి - గుంతకల్లు

గుంతకల్లు రైల్వే డివిజన్ మేనేజర్ కార్యాలయంలో మూడు రోజులుగా జరిపిన సిబిఐ అధికారుల సోదాలు శనివారం ముగిసాయి. శనివారం డిఆర్ఎం వినీత్ సింగ్‌తో పాటు నలుగురు అధికారులను అరెస్టు చేశారు. గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలోని కడప, తిరుపతి, కదిరి, గుంతకల్లు ప్రాంతాల్లో రైల్వే బ్రిడ్జిల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆ పనుల కాంట్రాక్టు కోసం కొంతమంది గుత్తేదారులు దరఖాస్తులు చేసుకున్నారు. ఆ కాంట్రాక్టు ఇప్పించాలంటే డబ్బులు ఇవ్వాలని రైల్వే డిఆర్ఎం వినీత్‌సింగ్, డిఎఫ్ఎం కుందా ప్రదీప్ బాబు, సీనియర్ డిఇఎన్ కో - ఆర్డినేషన్ అక్కిరెడ్డి గుత్తేదారుడిని డిమాండ్ చేశారు. దీంతో గుత్తేదారులు సిబిఐ అధికారులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో సిబిఐ డిప్యూటీ ఎస్పీ జై కుమార్ భరత్తియా నేతృత్వంలోని సిబిఐ బృందం రెండు రోజుల క్రితం గుంతకల్లు రైల్వే డివిజన్ కార్యాలయానికి వచ్చారు. గుత్తేదారు రమేష్ కుమార్ రెడ్డి గురువారం ఇంజనీరింగ్ విభాగం సూపరింటెండెంట్ ఎం.బాలాజీకి రూ. 14 లక్షల నగదు ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని విచారణ చేపట్టారు. ఈసందర్భంగా సిబిఐ అధికారులు కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. వారి తమ విచారణలో డిఆర్ఎం వినీత్ సింగ్, డిఎఫ్ఎం కుందా ప్రదీప్ బాబు, సీనియర్ డిఇఎన్ కో - ఆర్డినేషన్ అక్కిరెడ్డి, ఇంజనీరింగ్ విభాగం సూపరింటెండెంట్ ఎం.బాలాజీ, గతిశక్తి విభాగంలోని అకౌంట్స్ అసిస్టెంట్ డి.లక్ష్మీపతి రాజును నిందితులుగా గుర్తించి అరెస్టు చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించి కర్నూలు జిల్లా సీబీఐ కోర్టుకు తరలించినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

'అనంత'లో మరో డెంగీ కేసు

వారంలో రెండు కేసులు నమోదు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శనివారం మరో డెంగీ కేసు నమోదింది. వారం రోజుల క్రితం అరవిందనగర్‌లో తొలి కేసు నమోదు కాగా.. ప్రస్తుతం వినాయక నగర్‌లో నమోదైంది. రెండేళ్ల బాలుడికి డెంగ్యూ పాజిటివ్ వచ్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి. అయితే వివరాలను బహిర్గత పరచకుండా గోప్యంగా ఉంచేందుకు యత్నించడం గమనార్హం. రెండేళ్ల క్రితం ఇదే వినాయకనగర్‌లోని ఒక ముస్లిం కుటుంబంలో ఇద్దరు మగ పిల్లలు డెంగీవ్యాధితో మృతి చెందిన విషయం తెలిసిందే. అప్పట్లో ఈ డెంగీ కేసులో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. ఇద్దరు మగ పిల్లలను పోగొట్టుకున్న ఆ కుటుంబం వేదన వర్ణనాతీతం. తిరిగి అదే వినాయక నగర్ ప్రాంతంలో డెంగీ కేసు నమోదు కావడం అధికార వర్గాల్లో కలకలం రేపింది. శనివారం స్థానిక వినాయక నగర్ లోని బ్రైట్ స్కూల్ సమీపంలో ఒక మైనారిటీ కుటుంబానికి చెందిన రెండేళ్ల బాలుడికి డెంగ్యూ పాజిటివ్ నిర్ధారణ కావడంతో నగరంలో వారం రోజులు వ్యవధిలోనే రెండు కేసులు నిర్ధారణయ్యాయి.

మార్కెట్ యార్డ్‌లో పనుల నిర్వహణకు టెండర్లు ఖరారు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో యార్డులో పలు పనుల నిర్వహణ నిమిత్తం నిర్వహించిన టెండర్లను పలువురు గుత్తేదారులు దక్కించుకున్నారు. శనివారం సీల్ టెండర్లను తెరిచారు. ఎక్కువ మొత్తానికి కోడ్ చేసిన టెండర్‌దారులకు సంబంధిత పనులను మార్కెట్ కమిటీ అధికారులు అప్పగించారు. వీరందరికీ టెండర్లు ఖరారు చేస్తూ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎంపిక శ్రేణి కార్యదర్శి ఆర్.జయలక్ష్మి ఖరారు పత్రాలను జారీ చేశారు.



బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్, తదితరులు



విలేకరుల సమావేశంలో రైతుసంఘం నాయకులు

మేధాపాట్కర్ జైలు శిక్ష తీర్పును ఆపాలి

రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నర్మదా ప్రాజెక్ట్ బాధితులకు న్యాయం కోసం సుదీర్ఘంగా పోరాటం చేసిన మేధాపాట్కర్‌కు 23 ఏళ్ల నాటి ఒక కేసులో ఐదు నెలల జైలు శిక్ష, రూ.10 లక్షలు జరిమానా విధిస్తూ ఢిల్లీ కోర్టు ఇచ్చిన తీర్పును నిలుపుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాల రంగయ్య న్యాయ వ్యవస్థ ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. శనివారం స్థానిక గణేనాయక్ భవన్ రైతు సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్పొరేట్ శక్తులు పేదల జీవనోపాధిని దెబ్బతీస్తున్న క్రమంలో పేదల జీవనోపాధి హక్కుల కోసం పోరాడుతున్న గొంతులను నొక్కి వేసే ప్రయత్నంలో భాగంగానే మేధాపాట్కర్‌కు విధించిన శిక్షను చూడాల్సి వస్తోందన్నారు. కల్పిత వార్తలు, సమాచారం ప్రాతిపదికగా మేధాపాట్కర్‌కు విధించిన శిక్షను నిలుపుదల చేయాల్సిందే అన్నారు. ఈ శిక్షలు ప్రజాస్వామ్య గొంతుకులను అణిచివేసేందుకు, బాధిత ప్రజల పక్షాన నిలబడే సామాజిక స్పృహను దెబ్బ తీసేందుకు జరిగే ప్రయత్నంగా భావిస్తున్నట్లు తెలిపారు. మేధాపాట్కర్‌కు ఢిల్లీ కోర్టు విధించిన శిక్షను నిలుపుదల చేయాలని, నర్మదా ప్రాజెక్టులో సర్వం కోల్పోయిన బాధితులకు కేంద్ర ప్రభుత్వం, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్రలలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వాలు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు విరుపాక్షి, రాజారామ్ రెడ్డి, దస్తగిరి పాల్గొన్నారు.

శాస్త్రీయ విజ్ఞానాన్ని ఆచరించినప్పుడే దేశాభివృద్ధి

జెవివి రాష్ట్ర నాయకులు కె.శ్రీనివాస్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సైన్స్, శాస్త్ర విజ్ఞానాన్ని చదవడంతో పాటు ఆచరించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని జెవివి రాష్ట్ర నాయకులు కె.శ్రీనివాస్ అన్నారు. జనవిజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రాధా స్కూల్ ఆఫ్ లర్నింగ్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి జెవివి రాష్ట్ర నాయకులు కె.శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారతదేశం స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి అభివృద్ధి చెందుతున్న దేశంగానే పిలువబడుతుందన్నారు. మనతో పాటు మన తర్వాత స్వాతంత్రం వచ్చిన దేశాలు కూడా అభివృద్ధి చెందిన దేశాలుగా పిలవబడుతున్నాయని మనది మాత్రం అలాగే ఉందని అన్నారు. శాస్త్రీయ విజ్ఞానాన్ని పలు దేశాలు చదవడంతో పాటు ఆచరిస్తున్నాయని, అయితే మనదేశంలో కేవలం చదవడానికి మాత్రమే ఉపయోగిస్తున్నామని ఆచరించడం లేదని అన్నారు. దీనికి తోడు మూఢ నమ్మకాలపై ఎక్కువగా విశ్వాసం ఉంచుతున్నామని ఆయన అన్నారు. కాబట్టి హైస్కూలు స్థాయి నుంచే విద్యార్థులకు శాస్త్రీయ విజ్ఞానం పట్ల అవగాహన కల్పించి ఆచరించేలా చేయాలన్నారు. సమాజంలోని ప్రజలను చైతన్యవంతం చేసే గురుతర బాధ్యతను జనవిజ్ఞాన వేదిక తీసుకుందన్నారు. జెవివి అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. అనంతరం సేతు హైస్కూల్, విన్సెంట్ డిపాల్, విశ్వభారతి స్కూళ్లలో సభ్యత్వ నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, నగర అధ్యక్ష కార్యదర్శులు రామిరెడ్డి, వీరరాజు, నాయకులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు కార్డును అందజేస్తున్న జెవివి రాష్ట్ర నాయకులు శ్రీనివాస్

వినియోగంలోకి సిఅండ్‌డి ప్లాంట్ : మేయర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సిఅండ్‌డి ప్లాంట్ ఏర్పాటుతో భవన వ్యర్థాలకు తొలగించేందుకు ఎంతో దోహదపడుతుందని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్ క్యాప్ నిధులు రూ.30లక్షలతో ఏర్పాటు చేసిన సిఅండ్‌డీ ప్లాంట్(కన్స్ట్రక్షన్, డెమాలిషన్)ను మేయర్‌తోపాటు డిప్యూటీ మేయర్ విజయ భాస్కర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాంట్ పనితీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ నగరంలోని భవన నిర్మాణ వ్యర్థాలను నూతన ప్లాంట్ ద్వారా రీసైక్లింగ్ చేసే అవకాశం ఉంటుందన్నారు. భవన నిర్మాణ వ్యర్థాలను రీ సైక్లింగ్ చేసి ఇసుక, కంకరను వేరు చేసి ఫుట్‌పాత్, పేవర్ బ్లాక్‌లు, ప్యాచ్ వర్క్‌లకు వినియోగించుకోవచ్చన్నారు. రోజుకు కనీసం ఐదు టన్నుల వ్యర్థాలను మిషనరీ ద్వారా మళ్లీ వినియోగంలోకి తీసుకురావచ్చన్నారు. నగరంలో తొలగించిన భవనాల వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ప్లాంట్ వద్దే వ్యర్థాలను వేస్తే మళ్లీ వాటిని సిఅండ్‌డి ప్లాంట్ ను వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అభూ సాలెహా, కమల్‌భూషణ్, ఇఇ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నెలరోజుల్లో లక్ష్యాలను పూర్తి చేయాలి

బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి బ్యాంకర్లకు కేటాయించిన లక్ష్యాలను నెల రోజుల్లోగా తప్పనిసరిగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. శనివారం అనంతపురం జిల్లా పరిషత్ డిపిఆర్‌సి భవన్‌లో జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకర్లు కేటాయించిన లక్ష్యాలను చేరుకునేందుకు చిత్తశుద్ధితో పని చేయాలని ఆదేశించారు. బ్యాంకర్లంతా రైతులు, దళితులు, మహిళలకు ఎలాంటి ఉపాధి అవకాశాలు కలిగించామనేది ఆలోచించాలన్నారు. కొన్ని బ్యాంకులు ఒక్క రుణం కూడా మంజూరు చేయకపోవడం తగదన్నారు. రుణాల మంజూరులో 100 శాతం లక్ష్యాలు చేరుకోవాలన్నారు. స్టాండప్ ఇండియా కింద ప్రతి బ్యాంకు రెండు రుణాలను ఖచ్చితంగా మంజూరు చేయాలన్నారు. అన్ని బ్యాంకులు నెల రోజుల్లోగా కేటాయించిన రుణాలను మంజూరు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై సోషల్ మీడియా, ఇతర వేదికల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్క బ్యాంకు బ్రాంచ్‌లకు కూడా లబ్ధిదారుల దరఖాస్తులను పంపించాలని, డిక్కీ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ మహిళలకు రుణాలు వచ్చేలా చూడాలని అన్నారు. ముద్ర రుణాలకు సంబంధించి అన్ని బ్యాంకులు లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. కౌలు రైతులకు అందించే సిసిఆర్‌సి కార్డులకు సంబంధించి రుణాల మంజూరులో అర్హులైన ప్రతి ఒక్కరికి రుణాలు అందించాలన్నారు. ఫైనాన్షియల్ లిటరసీ సెక్టార్లు, ఇతర పథకాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. స్టాండప్ ఇండియా, విద్య రుణాలు, వ్యవసాయ సదుపాయాలు, స్వానిధి, రివర్స్ రుణాలు, ఎంప్లాయిమెంట్ జనరేషన్ రుణాలు, పీఎంఈజీపి, విశ్వకర్మ, హార్టికల్చర్ కింద ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ల కోసం రుణాల మంజూరు, తదితర అన్ని రకాల పథకాల కింద పూర్తి స్థాయిలో లక్ష్యాలను నెల రోజుల్లోగా చేరుకోవాలన్నారు. బ్యాంకర్లంతా రుణాల లక్ష్యాలను చేరుకునేందుకు పద్ధతి మార్చుకొని పని చేయాలని ఆదేశించారు. అనంతరం 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.18,992.35 కోట్ల వార్షిక రుణ ప్రణాళిక బుక్‌లెట్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎల్‌డిఎం నరసింగరావు, లీడ్ జిల్లా అధికారి గిరిధర్, నాబార్డ్ ఎజిఎం అనూరాధ, డిఆర్‌డిఎ పీడీ ఈశ్వరయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, మెప్మా పీడీ విజయలక్ష్మి, హ్యాండ్లూమ్స్ ఏడీ అప్పాజీ, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జి.నాగరాజారావు, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీ జిల్లా అధికారి మహేశ్వర్ రెడ్డి, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి రాజ్ కుమార్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఫిరోజ్ ఖాన్, బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ రసూల్, డిటిడబ్ల్యుఒ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

డిఎంహెచ్‌ఒ ఇబి.దేవి

ప్రజాశక్తి-వజ్రకరూరు

ప్రభుత్వ వైద్యాధికారులు ప్రజలందరికీ మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఇవి.దేవి సూచించారు. శనివారం ఉరవకొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా నమోదు అవుతున్న అతిసార కేసుల వివరాలను స్థానిక వైద్యాధికారి గంగాధర్ ను అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం 16, శనివారం 4 అతిసార కేసులు నమోదైనట్లు వివరించారు. అతిసార కేసులు నమోదు కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. ఎమ్ఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎంలు, ఆశాలు క్షేత్రస్తాయిలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే డయోరియా మరణాలు సంభవించకుండా చూడాలన్నారు. అతిసార బాధితులకు సరైన వైద్యసేవలు అందేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఇఎంఒ త్యాగరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ సుబ్రమణ్యం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పండ్ల మొక్కలు పంపిణీ

వజ్రకరూరు : అనంతపురానికి చెందిన యాక్షన్ ఫెట్రానా(ఎకాలజీ) సహకారంతో ఉరవకొండలోని జైకిసాన్ ఫౌండేషన్ నిర్వాకులు నాగమల్లి ఓబులేష్ రైతులకు శనివారం ఉచితంగా పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. ప్రతి రైతుకూ దానిమ్మ, సపోటో, ఉసిరి, సీతాఫలం, జామ, వేప మొక్కలు ఒక్కొక్కటి చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, సంస్థ సభ్యులు నాగమల్లి రజినీకుమారి, లావణ్య, సుందరీష్, తదితరులు పాల్గొన్నారు.

పాత పద్ధతులే.....

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రభుత్వం మారింది...పాలనలో మార్పులేమైనా వస్తాయని ప్రజలు ఆశించారు. కొత్త ప్రభుత్వం పూర్తి స్థాయిలో కొలువుదీరిన నేపథ్యంలో జనం ఈ ప్రభుత్వం పాలనలో మార్పులేమైనా ఉంటాయని ఆశలు పెట్టుకున్నారు. కాని క్షేత్ర స్థాయిలో అందుకు భిన్నమైన వాతావరణం కనిపిస్తుండటం అందరిలోనూ విస్మయానికి గురిచేస్తోంది. గతంలో లాగానే రాజకీయపరమైన ఒత్తిళ్లు సామాన్యులపై పెరుగుతుండటం ఈ వారంలో కనిపించింది. పాలన పూర్తిస్థాయిలో ఏర్పాటైన నేపథ్యంలో అధికారపార్టీ నేతలు అప్పుడే తమ అధికార దర్పణాన్ని కొన్ని చోట్ల ప్రదర్శిస్తుండటం కనిపిస్తోంది. ప్రధానంగా చిరు ఉద్యోగులపై ప్రతాపం మొదలైందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్కిమ్ వర్కర్లుగా పనిచేస్తున్న చిన్నచిన్న ఉద్యోగులపై రాజకీయపరమైన ఒత్తిళ్లు పెరుగుతుండటం గమనార్హం. ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఇలా చిన్నచిన్న పనులు చేసుకునే వారందరినీ తొలగించే కార్యక్రమం పెద్దఎత్తునే జరుగుతోంది. ఇప్పటి వరకు వీటిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు ఒక్కసారి దిక్కుతోచని స్థితిలో పడ్డాయి. ఈ క్రమంలోనే వజ్రకరూరు మండలంలోని ఛాయపురంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికురాలు ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. మరో దగ్గర ఆశా వర్కరును తప్పుకోవాలని అధికారపార్టీ నేత ఒకరు బెదిరంపులకు పాల్పడ్డారు. తమ పార్టీకు 164 స్థానాలొచ్చాయమని మరీ చెబుతూ హెచ్చరికలు జారీ చేసిన ఆడియో కూడా ఒకటి బయటకు వచ్చింది. ఇలా రోజుకొక ఉదంతం బయటకు వస్తుండటంతో కొత్త ప్రభుత్వం తీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక వాలంటీర్ల పరిస్థితి వేరే చెప్పనక్కర్లేకుండా ఉంది. ఇక మట్టి, ఇసుక తవ్వకాలు కూడా ఆ పార్టీ నాయకుల స్థానంలో ఇప్పుడు ఈ పార్టీ నాయకులు చేరుకుని ఈ రకంగా సామాన్యులను ఇబ్బందులు పెట్టడం సరైంది కాదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇకపోతే ఈ వారంలో వానల్లేకపోవడం రైతులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. జూన్ మొదటి రెండు వారాలు అత్యధిక వర్షాలు పడటంతో సీజన్ ప్రారంభం జోరుగా ఉందని భావించారు. కాని తీరా చూస్తే విత్తనం విత్తుకునే సమయం ఆసన్నమైనా చినుకు జాడలేదు. రోజు కారుమబ్బులు కమ్ముకుని రావడం చిను నేల రాలకుండానే ఆకాశం తేలిపోతుండటం నిత్యకృత్యమైంది. అదును వచ్చినా పదును లేకపోవడంతో రైతులు ఈ ఏడాదీ కరువే ఉంటుందా అని ఆందోళన చెందుతున్నారు. గతేడాది 2023లోనూ వర్షాభావంతోనే రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈసారీ అదే పరిస్థితి నెలకొంటే ఇబ్బందులు తప్పవని ఆందోళన చెందుతున్నారు. అయితే సాగునీటికి కష్టాలు తొలిగేలా కన్పిస్తున్నాయి. తుంగభద్ర ఎగువ భాగంలో పడిన వర్షాలకు తుంగభద్ర డ్యామ్‌కు పుష్కలంగా నీరొచ్చి చేరుతోంది. నలభై వేల క్యూసెక్కులపైగా వరద వస్తుండటం ఒక్కటే ఈ వారంలో చోటు చేసుకున్న శుభపరిణామం. డ్యామ్‌కు తగినంత నీరొస్తే ఈనెల 20వ తేదీ నుంచి తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీరు తీసుకోవాలని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేసియున్నారు. ఈ ప్రకారం వస్తే కొంత వరకు సాగు,తాగునీటికి ఇక్కట్లు లేకుండా ఉండే అవకాశముంది.



ఆవాజ్ నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న ఆవాజ్ జిల్లా నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని హంపిరెడ్డి భవనంలో ఉన్న ఆవాజ్ కార్యాలయంలో జిల్లా నాయకులు అబ్దుల్లా ఆధ్వర్యంలో శనివారం పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా షేక్ అబ్దుల్లా, అధ్యక్షులుగా షేక్ షాషావలి, సహాయ కార్యదర్శిగా కె.జాకీర్‌హుస్సేన్, ఉపాధ్యక్షులుగా మౌదీనాబాద్ మస్తాన్, కోశాధికారిగా ఉత్తరాసుల ఖాదర్‌తో పాటు 12 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముందుగా ఆవాజ్ జిల్లా కార్యదర్శి దివంగత ముష్కిన్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన పోరాటాలను గుర్తు చేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు అబ్దుల్లా మాట్లాడుతూ మైనార్టీ హక్కుల సాధన కోసం పోరాటాలు చేస్తామన్నారు. మైనార్టీలకు ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలు సాధించుకోవడం కోసం రాబోయే రోజుల్లో ఉద్యమాలు చేస్తామన్నారు. బిజెపి మతోన్మాద కారణంగా కులమతాల మధ్య చిచ్చు పెడుతోందన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. లౌకికవాదం, రాజ్యాంగం పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమాలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో నాయకులు జానీ, రహీం, హుస్సేన్, సాదిక్, హుసేన్ పీరా, రెహమాన్, వలిబాషా, తదితరులు పాల్గొన్నారు.

దాడులు ఆపకపోతే ప్రతిదాడులు తప్పవు

వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి ప్రణయ్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ప్రణయ్‌రెడ్డి

ప్రజాశక్తి-వజ్రకరూరు

నియోజకవర్గంలో వైసిపి నాయకులే లక్ష్యంగా టిడిపి శ్రేణులు చేస్తున్న దాడులను ఆపకపోతే ప్రతిదాడులు చేయాల్సి వస్తుందని వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి ప్రణయ్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం ఉరవకొండలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైసిపి కార్యకర్తలపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. అయినా పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఎల్లకాలం అధికారంలో మీరే ఉండరనే విషయాన్ని టిడిపి నేతలు గుర్తుకు పెట్టుకోవాలని హెచ్చరించారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ఉపయోగించుకుని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయకుండా కక్షసాధింపు చర్యలకు దిగడం మంచిది కాదని హితవు పలికారు. ఇదేవిధంగా దాడులకు పాల్పడితే రెట్టింపు ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నరసింహులు, మాజీ జడ్పీటీసీ తిప్పయ్య, పట్టణ కన్వీనర్ ఎర్రిస్వామి, నాయకులు బసవరాజు, గోవిందు, దనుంజయ్య, ఈడిగ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

డీలర్‌పై కేసు నమోదు చేయాలి : ఎన్‌టిఎ

అనంతపురం క్రైం : నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కోరుమానిపల్లెలోని ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుని విధులకు ఆటంకం కల్గించి భయభ్రాంతులకు గురి చేసిన డీలర్‌పై కేసు నమోదు చేయాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టిఎ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాస్‌రావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అసభ్య పదజాలంతో దూషించిన రేషన్ డీలర్ ను కఠినంగా శిక్షించాలని విన్నవించారు. ఎంఇఒ అనుమతిలేకుండా రేషన్ బియ్యాన్ని పాఠశాల గదుల్లో పెట్టొద్దన్న ఉపాధ్యాయుడిపై డీలర్ నోటికి వచ్చినట్లు దుర్భాషలాడడం సరికాదన్నారు. టీచర్ కన్నీళ్లు పెట్టుకున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోందన్నారు. బాధ్యుడిపై వెంటనే చర్యలు తీసుకుకుని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

9న ఉచిత మెగా కంటివైద్యశిబిరం

పామిడి : స్థానిక వాసవీ కళ్యాణ మండపంలో లయన్స్ క్లబ్, శంకర కంటి ఆసుపత్రి బెంగళూరు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 9న మంగళవారం ఉచిత కంటి ఆపరేషన్ల మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో కంటిలో శుక్లములు ఉన్నవారికి, ఆపరేషన్లు వంటివి చేయనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేంద్ర మంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్యే

రాయదుర్గం : రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అనంతపురం జిల్లా ఛైర్‌పర్సన్ కాపు భారతి దంపతులు శనివారం విజయవాడ బిజెపి కేంద్ర కార్యాలయంలో కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజ శ్రీనివాస్‌వర్మను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా బొకే అందజేసి శాలువతో సత్కరించారు.

పారిశుద్ధ్య కార్మికులు మాస్కు ధరించాలి

నార్పల : నేటి నుంచి గుగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పారిశుధ్య పనులు చేపట్టే కార్మికులు మాస్కులు ధరించాలని ఎంపిడిఒ రాముడు కోరారు. వారంరోజుల నుంచి మండలంలోని వివిధ శాఖల ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు గూగూడులోనే ఉంటూ ఉత్సవాల ఏర్పాట్లను చేస్తున్నారన్నారు. వీరందరూ దుమ్మూధూళితో శ్వాసకోస వ్యాధులు రాకుండా ముఖాలకు మాస్కులు ధరించాలన్నారు.

పూర్వవిద్యార్థుల కలయిక

శింగనమల : మండలంలోని సలకంచెరువు హైస్కూల్‌లో 1996-97లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు శనివారం కలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గర్భకోశ చికిత్స శిబిరం

నార్పల : ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా పశువులకు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గోవిందరాజు మాట్లాడుతూ 90 శాతం కచ్చితత్వంతో పేయిదూడల పుట్టుక లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం రూ.1350 విలువజేసే రెండు సూదులను రూ.500తో అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతపురం డివిజన్ ఉప సంచాలకులు శ్రీనివాస్‌రావు, బుక్కరాయసముద్రం సహాయ సంచాలకులు రత్నకుమార్ పాల్గొన్నారు.

రాయదుర్గం అభివృద్ధికి కృషి

కౌన్సిల్ ఎక్స్‌అఫిషియో సభ్యులుగా 'కాలవ' ప్రమాణ స్వీకారం



కౌన్సిల్ ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించిన రాయదుర్గం ప్రజల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. పురపాలక సంఘం అధ్యక్షురాలు పొరాళు శిల్ప అధ్యక్షతన శనివారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ముందుగా మున్సిపల్ కౌన్సిల్ ఎక్స్ అఫిషియో సభ్యులుగా కాలవ శ్రీనివాసులుతో కమిషనర్ పి.కిషోర్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ పట్టణంలో తాగునీరు, పారిశుధ్యం, మురికి కాలువలు, వీధిదీపాల సౌకర్యాలను మెరుగు పరిచేందుకు కృషి చేస్తానన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు చెల్లించే పన్ను దుర్వినియోగం కాకుండా రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేద్దామన్నారు. ముఖ్యంగా పట్టణంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉండటానికి అధికారుల నిర్వహణ లోపం ఉందన్నారు. ఇటీవలే తాను మున్సపల్ ఇంజనీరింగ్, విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి 15 రోజుల్లోగా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు చెప్పారు. పురపాలక మండలి సభ్యులు కూడా రాజకీయాలను పక్కనపెట్టి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం పురపాలక సంఘం తరపున సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల చేపట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్యే శ్రీనివాసులుకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ శిల్ప వినతిపత్రం అందజేశారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ పట్టణంలో పశువులు, కుక్కలు, దోమల బెడదను నివారించాలని కోరారు. వర్షాకాలంలో మురికి కాలువలలో పూడిక తొలగించి వర్షం నీరు వీధులు, ఇళ్లలోకి ప్రవేశించకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపల్ ఇంజనీర్ సురేష్ మాట్లాడుతూ ప్రస్తుతం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో నిల్వ ఉన్న నీరు 25 రోజులకు సరిపోతాయన్నారు. ఈలోగా తుంగభద్ర ఎగువ కాలవ నుంచి నీరు విడుదల చేస్తే రాబోయే రోజుల్లో నీటి ఎద్దడిని నివారించవచ్చన్నారు. తాగునీటి సరఫరా, వీధి దీపాలకు సంబంధించిన అంశాలు మినహా మిగతా అంశాలను కౌన్సిల్ వాయిదా వేసింది. అనంతరం ఎమ్మెల్యే శ్రీనివాసులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం తహశీల్దార్ చిట్టిబాబు, విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్ బాలచందర్, వైస్‌ఛైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, పాలకమండలి సభ్యులు, అధికారులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళి



అనంతపురంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ ఛైర్‌ఫర్సన్ బోయ గిరిజమ్మ

ప్రజాశక్తి-అనంతపురం అర్బన్


స్వాతంత్ర్య సమరయోధులు, దేశ దళిత తొలి ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలను కొనసాగిద్దామని జిల్లా ప్రజా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పిలుపునిచ్చారు. బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలోని ఛైర్‌పర్సన్ ఛాంబర్‌లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ ఛైర్ పర్సన్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ స్ఫూర్తితో సమసమాజ స్థాపనకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి లలితాబాయి, కార్యాలయ పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వజ్రకరూరు : భారతదేశ ప్రథమ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని శనివారం ఉరవకొండ పట్టణంలో ఎమ్మార్పీఎస్, దళిత గిరిజన హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో వేరువేరుగా నిర్వహించారు. స్థానిక టవర్ క్లాక్ కూడలిలో ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుల రహిత సమాజం కోసం అహర్నిశలు ప్రయాసపడిన గొప్ప మహానుభావుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిజిహెచ్ఎస్ఎస్ వ్యవస్థాపకులు గోపాల్, సభ్యులు నాగరాజు, చంద్రశేఖర్, అంబేద్కర్ సేవా రాష్ట్ర నాయకులు బి.రమేష్, విసికె నాయకులు గోపాల్, ప్రణవి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.రాజు, ఎమ్మార్పీఎస్ తాలూకా అధ్యక్షులు రాంపురం చెన్నప్ప, గౌరవ అధ్యక్షులు గంగాధర, తాలూకా కార్యదర్శి కౌకుంట్ల సురేష్, యువజన విభాగం అనంతపురం పార్లమెంటు కార్యదర్శి రాయంపల్లి వెంకటేష్, తాలూకా నాయకులు మారెన్న,తదితరులు పాల్గొన్నారు.

నార్పల : బాబూ జగ్గీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని క్రాసింగ్‌లో సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షులు మీనుగ రామాంజనేయులు, సిపిఎం నాయకులు గంగాధర్, ఎంఆర్‌పిఎస్ నాయకులు గూగూడు సాయి, శోదనపల్లి నారాయణ, రాజు, ప్రసాద్, తుంపెర రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ప్రారంభించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్



జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సాలాబాయికి ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి పేద, మధ్య తరగతి విద్యార్థులు విద్యను అభ్యసించడానికి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వస్తున్నారన్నారు. వారిని దృష్టిలో ఉంచుకుని మధ్యాహ్న భోజనాన్ని పున ప్రారంభించాలన్నారు. ఇకపోతే విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు నెలరోజుల కావస్తున్నా ఇప్పటికీ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదన్నారు. కళాశాలలో విద్యార్థులకు కనీసం మంచినీళ్ల సదుపాయం కూడా లేని దౌర్భాగ్యమైన పరిస్థితిలో ఉండటం బాధాకరమన్నారు. అలాగే విద్యార్థినులకు ప్రత్యేక మరుగుదొడ్ల సదుపాయం, వెయిటింగ్ హాలు, లైబ్రరీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ సాలాబాయికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి వెంకటేష్, పట్టణ నాయకులు కిషోర్,సమీర్, జయరామ్, చందు, సన్నీ, జాకీర్, ఇర్ఫాన్, కుళ్లాయిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను అరికడదాం : ఎంపిడిఒ

ప్రజాశక్తి-వజ్రకరూరు

ప్రజలతో సమన్వయంగా పని చేసి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అరికడదామని ఉరవకొండ ఎంపిడిఒ సుబ్బరాజు సూచించారు. శనివారం ఉరవకొండ మండలంలోని రాకెట్ల,పెద్ద కౌకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధిరులు పావని, లక్ష్మీ చందనతో కలిసి వ్యాధుల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం పెద్దకౌకుంట్ల-2 గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది హాజరు, బయోమెట్రిక్ అటెండెన్స్‌ను పరిశీలించారు. సచివాయల సిబ్బంది సమయానికి వచ్చి ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను అందించాని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, చౌడప్ప, హెల్త్ సూపర్‌వైజర్ శేఖర్, ఎంపిహెచ్ఇఒ గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి విరాళం

గుత్తి : మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించనున్న ఆలయాల నిర్మాణానికి గుత్తి మండల బలిజ సంఘం అధ్యక్షుడు బండి సత్య శనివారం విరాళం ఇచ్చారు. చెర్లోపల్లిలో త్వరలో చెన్నకేశవ స్వామి, శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాలు నిర్మించనున్నారు. ఈమేరకు బండి సత్య స్వగృహంలో చెర్లోపల్లి సర్పంచి అప్పా వెంకటేశ్‌కు రూ.20వేల విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం పట్టణ అధ్యక్షుడు శ్రీకరం హరి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న ఆర్యవైశ్యులు

గుత్తి : మొక్కలను నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మాకం శ్రీకాంత్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని వన్నేదొడ్డి గ్రామ శివారులో ఎన్టీపీసీ పవర్ గ్రిడ్ ఎదురుగా గుత్తి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా 116 మంది ఆర్యవైశ్య దంపతులు ఒక్కో మొక్క నాటారు. అనంతరం మాకం శ్రీకాంత్ మాట్లాడుతూ మంచి వాతావరణం ఇచ్చేందుకు ప్రతి కుటుంబ మొక్కలు నాటాలన్నారు. మొక్కల పెంపకంతోనే సకాలంలో వర్షాలు కురుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చౌదరి విజయభాస్కర్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు కలుగొట్ల కిషోర్, మంజునాథ్, కాసుల ఆశోక్, లక్ష్మీనారాయణ, హరి, మాకం రంగనాథ్, వారణాసి రజనీ, వేణుగోపాల్, సుదర్శన్, ఆర్యవైశ్య మహిళ, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

24 గంటల్లో హత్యకేసు ఛేదింపు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

గుంతకల్లు రూరల్ : 24 గంటల్లోనే హత్య కేసును ఛేదించి గుంతకల్లు రూరల్ పోలీసులు తమ సామర్థ్యాన్ని చాటుకున్నారు. శనివారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ సురేష్‌బాబు హత్య కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. వారు తెలిపిన వివరాల మేరకు.. గురువారం రాత్రి మండల పరిధిలోని నల్లదసరపల్లి గ్రామానికి చెందిన ఆవుల లక్ష్మన్న (50) దారుణహత్యకు గురైన విషయం పాఠకులకు విధితమే. అయితే మృతుని కుటుంబ సభ్యులు లక్ష్మన్న ఇంటికి రాలేదని ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయట్లేదని పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయడంతో లొకేషన్ ఆధారంగా వెతికామన్నారు. రాత్రి వేల కావడంతో అతడిని వెతకడం చాలా కష్టమైందని, అయినా పదేపదే ఫోన్ చేస్తూ వెతుకుతూ వెళ్లగా సెల్‌ఫోన్ వెలుతురు కనిపించిందన్నారు. ఎట్టకేలకూ ఫోన్ వద్దకు చేరగా అతడు కత్తి పోట్లకు గురైన మరణించినట్లు గుర్తించామన్నారు. వెంటనే క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్, టెక్నికల్ సిబ్బందితో కలిసి నిందితుల కోసం గాలించామన్నారు. ఈనేపథ్యంలో శనివారం ఉదయం 10:30 సమయంలో నకరా దొడ్డి దగ్గర ఉన్న రైల్వే వంతెన వద్ద నిందితులు చంద్రశేఖర్, రాజశేఖర్, సతీష్‌ను అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిపారు. ఈ విచారణలో మృతుడు లక్ష్మన్న రెండవ కుమార్తె లలితను చంద్ర అనే వ్యక్తి వివాహం చేసుకున్నట్లు తెలిపారు. కొద్దికాలంగా కుటుంబ కలహాలతో విడిపోవడంతో తిరిగి కాపురానికి రావాలంటూ పంచాయితీ చేసినట్లు తెలిపారు. పంచాయితీ చేసిన తర్వాత కూడా కాపురానికి కాపురానికి పంపించాలని అడగడానికి వెళ్లిన అల్లుడిని చెప్పుతో కొట్టి అవమానించడంతోపాటు, కాలరు పట్టుకుని అవమానించాడనే హత్య చేసినట్లు ఒప్పుకున్నారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

మల్లాపురం లేఅవుట్‌లో చోరీ

రాయదుర్గం : పట్టణంలోని మల్లాపురం లేఅవుట్‌లో నివాసం ఉంటున్న నాగభూషణ ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. నాగభూషణం, కుటుంబ సభ్యులు తన నివాసం పక్క గదిలో నివసిస్తుండగా ఇంటి తలుపు తాళం విరిచి దొంగలు ఇంట్లో ప్రవేశించి బీరువాలో దాచిన బంగారు, వెండి ఆభరణాలు నగదు చోరీ చేశారు. ఉదయం ఇంటి యజమాని నాగభూషణం తమ ఇంటి తాళం విరిగి ఉండడాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పొదుపు సంఘానికి సంబంధించిన రూ.75,700 నగదు, హుండీలో దాచిన సుమారు రూ.8వేల వరకూ, జత బంగారు కమ్మలు, జత వెండి కుంకుమ భరణి గిన్నెలు, చోరీకి గురైనట్లు యజమాని నాగభూషణం వాపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ల పట్టివేత

తాడిపత్రి రూరల్ : మండలంలోని పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు శనివారం పట్టుకున్నారు. మండల పరిధిలోని నందలపాడు, చుక్కలూరు, పెన్నానది పరిసర ప్రాంతాల్లో నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న 10 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకపోవడంతో సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సీఐ లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు.

ఆన్‌లైన్ అడ్మిషన్ల పక్రియ ప్రారంభం

రాయదుర్గం రూరల్ : స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రఘు రామమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బిఎ, బీకాం, బీఎస్సీ కోర్సులకు సంబంధించి సింగిల్ మేజర్ సబ్జెక్టులు ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, స్పెషల్ తెలుగు, కంప్యూటర్ అప్లికేషన్స్, కామర్స్, మైక్రో బయాలజీ, మ్యాథమెటిక్స్ ఫిజిక్సు, బాటనీ, కోర్సులు ఉన్నాయన్నారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

తలనీలాలకు వేలంపాట

నార్పల : మండలం పరిధిలోని గూగూడు కుళ్లాయిస్వామి ఆలయంలో ఆవరణంలో తలనీలాల పోగుకోసం శనివారం వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు చెందిన శ్రీనివాసులు రూ.25,65,000కు వేలం దక్కించుకున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి సాకేతపురం శోభ తెలిపారు.

ట్రై సైకిళ్లు వితరణ

ఆత్మకూరు : పరిటాల మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి ట్రై సైకిళ్లను వితరణ చేశారు. ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ, నాయకులు బాలాజీ సహకారంతో రోగుల సౌకర్యార్థం అందజేసిన ట్రై సైకిళ్లను ఆసుపత్రి డాక్టర్ షబీనాకు అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షులు అంకే ఆనంద్, నాయకులు దుబ్బ రవీంద్రారెడ్డి, హనుమప్పచౌదరి, గుజ్జుల రవిప్రసాద్, బొమ్మయ్య, హనుమంతు, మంద హక్కులన్న, ఉమాపతి, రామకృష్ణారెడ్డి, ఎగిడి మల్లన్న, వడ్డే వసూరప్ప, మందా శేషు, అంజి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచితంగా ఇసుక

ప్రజాశక్తి-శింగనమల

రాష్ట్రంలోని పేదలందరికీ ఉచితంగా ఇసుక అందజేయనున్నట్లు టిడిజి జిల్లా నాయకులు కాయల రమణయాదవ్ తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబుతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. ఇందులో భాగంగానే ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి రాగానే పేదలందరికీ ఉచితంగా ఇసుక అందజేస్తున్నట్లు సిఎం ప్రకటించారన్నారు. రానున్న రోజుల్లో కూడా ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ముచ్చుకోట శివయ్య, రాముడు, నాగరాజు, ఆది, తదితరులు పాల్గొన్నారు

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి



మానవహారంగా ఏర్పడిన వైద్యసిబ్బంది, విద్యార్థులు

ప్రజాశక్తి-యాడికి

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ సావిత్రమ్మ, ఇఒఆర్‌డి వెంకటేశ్వర్లు, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ చిగురుపాటి శ్రీనివాసులు సూచించారు. డెంగీ నివారణ మాసోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య పరిధిలో జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా మానవహారంగా ఏర్పడి వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ కాసప్ప, హైస్కూల్ ఇన్‌ఛార్జి హెడ్‌మాస్టర్ నాగన్న, డాక్టర్ శ్రీరామ్‌కుమార్, సిహెచ్ఓ జుబేదా, పీహెచ్ఎన్ వెంకటలక్ష్మి, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లు తొలగించాలని వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న కాలనీవాసులు

పామిడి : ఇళ్ల మీద వెళ్తున్న విద్యుత్ లైన్లను తొలగించాలని కోరుతూ స్థానిక కొండాపురం బీసీ కాలనీవాసులు శనివారం స్థానిక విద్యుత్ కార్లాయంలో విద్యుత్ సిబ్బంది నరసింగరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాఘవేంద్ర ఇంటి వద్ద కరెంటు స్తంభం వంగడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అని భయాందోళనగా ఉందన్నారు. అదేవిధంగా బాల రంగడు ఇంటి వద్ద ప్రమాదకర స్థాయిలో విద్యుత్ లైన్లు ఉన్నాయన్నారు. ఆయా లైన్లు తొలగించాలని ఇప్పటికే అనేకమార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇందుకు అధికారి నరసింగరావు స్పందిస్తూ వెంటనే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు రాఘవేంద్ర, రమేష్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ